లాభసాటి వ్యవసాయానికి ఆర్బీకేలు దోహదం

నంబూరు ఆర్బీకేలో ట్రైనీ కలెక్టర్లు



ఆర్బీకే సేవలను ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు

పెదకాకాని: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాంకేతిక సమాచారం అందించడం.. లాభసాటి వ్యవసాయానికి దోహదపడుతుందని గుంటూరు జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు అన్నారు. మంగళగిరి రూరల్ మండలం కాజ గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్(ఏపీ హెచ్ఆర్ ఐడీఐ)లో శిక్షణ పొందుతున్న 25మంది ట్రైనీ కలెక్టర్ల బృందం సోమవారం నంబూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతులు కియోస్క్ యంత్రం ద్వారా ఎరువులు ఆర్డర్ పెట్టుకునే విధానాన్ని తెలియజేశారు. విత్తనాలు, పురుగు మందులు, రైతులకు సాంకేతిక సమాచారం అందించేందుకు డిజిటల్ లైబ్రరీ, పంట నమోదు విధానం, వీఏఏల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అల్పాహారం పంపిణీ



ప్రత్తిపాడు: విద్యా రంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని జడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. హెచ్ఎం రమాదేవి ఆధ్వర్యంలో జడ్పీటీసీ విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఉప సర్పంచ్ దాసరి చెంచురామారావు, ప్రత్తిపాడు వైస్ ప్రెసిడెంట్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, పి.రామారావు, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు కాల్వను విస్తరించాలి



పెదనందిపాడు: గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించి, పనులు మొదలు పెట్టాలని నల్లమడ రైతు సంఘం నాయకులు ఇరిగేషన్ ఎస్ఈ ఉమా మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గుంటూరులో జరిగిన స్పందన కార్యక్రమంలో ఈ మేరకు అర్జీని సమర్పించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ.. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే 50 గ్రామాలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి భూ సేకరణకు నిధులు కేటాయించేలా చొరవచూపాలని ఆయన కోరారు.

'ఉయ్యాలవాడ' విగ్రహాల ఏర్పాటుకు కృషి

గుంటూరు రూరల్: స్వాతంత్య్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి ఈ నెల 22న నిర్వహించనున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయన విగ్రహాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఏపీ రెడ్డి సంఘాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ గంగులకుంట నరేష్ కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బ్రిటీష్ వాళ్లని ఎదురించిన మొదటి తెలుగు వీరుడు ఉయ్యాలవాడని పేర్కొన్నారు. ఆయన విగ్రహాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెదకాకాని: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు మెమోలు

ప్రత్తిపాడు: మండలంలో నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు. ఇటీవల ఆర్జేడీ సుబ్బారావు, డీఈఓ శైలజ నడింపాలెం హెచ్ఈ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సమయంలో సాధన పుస్తకాల్లో కరెక్షన్ చేయకపోవడాన్ని గమనించారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న డీఈఓ ఆ పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎస్.రాంబాబుతో పాటు ఉపాధ్యాయులు పీజే నళిని, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, షేక్.చినజానీ బేగంకు మెమోలు జారీ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బాజీ బాబా దర్గాలో అన్న సంతర్పణ



పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులకు సోమవారం అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దర్గా ప్రాంగణంలో కొందరు నిద్ర చేస్తుంటారు. ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో భక్తులందరికీ అన్నదానం చేశారు. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా నాగేశ్వరస్వామి రథోత్సవం



కల్యాణమూర్తులను రథం వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, పక్కన ఎమ్మెల్యే కిలారి



పుర వీధుల్లో రథోత్సవం

చేబ్రోలు: ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి రథోత్సవం సోమవారం స్థానిక పుర వీధుల్లో అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల హర నామస్మరణతో గ్రామం మారుమోగింది. సుమారు వందేళ్ల నాటి భారీ రథంపై గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి కల్యాణ మూర్తులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని లాగి, ప్రధాన రహదారుల్లో భక్తులతో కలసి నడిచారు. పాత పోలీసు స్టేషన్ సమీపంలో కొద్ది సేపు రథాన్ని ఆపి గంగానమ్మ తల్లికి పూజలు చేశారు. చేబ్రోలు పరిసర గ్రామాల మహిళలు, పిల్లలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మహిళా భక్త సమాజం కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. దేవాదాయశాఖ ఈఓ పోతుల రామకోటేశ్వరరావు రథోత్సవాన్ని పర్యవేక్షించారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

- అణగారిన వర్గాలకు డిప్యూటీ సీఎం, హోం శాఖలు
- బీసీల్లో ప్రతి వర్గానికి చట్టసభల్లో చోటు
- ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనపై ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



గుంటూరు రూరల్: మహాత్మా గాంధి కలలు గన్న గ్రామ స్వారాజ్యాన్ని సచివాలయాల ద్వారా నిజం చేస్తూ.. చరిత్ర సృష్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు సామాజిక న్యాయంతో అణగారిన వర్గాలకు, దళితులకు చట్ట సభల్లో చోటు కల్పించి భారతదేశంలో ప్రతి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించి, అందులో బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించడంపై ఆమె సోమవారం స్పందించారు. భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు నిండినా.. కనీసం చట్ట సభలు అంటే ఏంటో తెలియని వర్గాలు ఇంకా ఎన్నో ఉన్నాయన్నారు. అటువంటి వర్గాలకు ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించి, రాజకీయ చరిత్రలో ప్రతి ఒక్కరికీ జగనన్న మార్గదర్శకంగా నిలిచారన్నారు. బీసీలకు 70 శాతం ప్రాధాన్యం కల్పించి, సామాజిక న్యాయం చేసిన ఘనత జగనన్నకే సాధ్యమైందన్నారు. అట్టడుగు వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు, దేశంలో ఎక్కడా లేని విధంగా దళితులకు హోంశాఖను కేటాయించారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తిగా నేడు దేశంలోని పలు రాష్ట్రాలు ఆయన బాటలో నడుస్తున్నాయన్నారు. నేటి రాజకీయాల్లో జగనన్న ఒక మైలు రాయిగా నిలిచి.. సామాజిక న్యాయంతో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించినట్లు చెప్పారు. అటువంటి జగనన్నకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు సముచిత స్థానం

ఎమ్మెల్సీ అభ్యర్థి ఏసురత్నంకు నేతల ఘనస్వాగతం



ఏసురత్నంను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తాఫా, నేతలు

పెదకాకాని: బీసీలకు సముచిత స్థానం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రగిరి ఏసురత్నం పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రగిరి ఏసురత్నంను ప్రకటించిన అనంతరం తాడేపల్లి నుంచి గుంటూరు నగరానికి వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాత్రి పెదకాకాని వై.జంక్షన్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తాఫాతో పాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు యేసురత్నంను కలసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ.. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీలో తప్పక గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో.. తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. గుంటూరు తూర్పు వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరిఫాతిమా, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో బిల్ రీడర్ మృతి



రాజశేఖర్ మృతదేహం

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ఒక బిల్ రీడర్ నిండు ప్రాణాన్ని బలితీసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన బత్తుల రాజశేఖర్ (30) విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన బిల్ రీడర్‌గా పని చేస్తున్నాడు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామస్తులు భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి కోటప్పకొండ తిరునాళ్లకు తరలించారు. తిరిగి వచ్చే క్రమంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా గ్రామ ప్రధాన రహదారిలోని విద్యుత్ పోల్స్ నుంచి సర్వీస్ వైర్లను తప్పించి సరఫరాను నిలిపివేస్తారు. మరలా ప్రభ తిరిగి గ్రామానికి చేరుకున్న తర్వాత విద్యుత్ శాఖ సిబ్బంది సర్వీస్ వైర్లను యథాస్థానంలో ఉంచి ఇళ్లకు సరఫరాను పునరుద్ధరిస్తారు. అయితే, ఈ ప్రక్రియ అంతా సంబంధిత విద్యుత్ శాఖ లైన్ మెన్లు, హెల్పర్లు చేయాలి. కానీ గొట్టిపాడులో లైన్‌మెన్లు, హెల్పర్లు కాకుండా ఈ తతంగాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు, బిల్ రీడర్లతో చేయించారు. అందులో భాగంగానే రాజశేఖర్‌తో పాటు మరో బిల్ రీడర్ సర్వీస్ వైర్లు పోల్‌కి అనుసంధానం చేస్తున్నారు. ఇంట్లో సర్వీస్ వైర్లు కలుపుతున్న సమయంలో ఇన్వర్టర్ ఆన్‌లో ఉండటంతో రాజశేఖర్‌కు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే కుప్ప కూలిపోయారు. విద్యుత్ పోల్‌పైన ఉన్న మరో బిల్‌రీడర్ గమనించి స్థానికులకు తెలియజేయడంతో రాజశేఖర్‌ను స్థానికంగా ఉన్న ఒక ఆర్ఎంపీ వద్దకు, అక్కడి నుంచి మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆగ్రహంతో రగిలిపోయిన గ్రామస్తులు

ఈ ఘటనపై తమకు సంబంధం లేదని, అతను పోల్‌పై ఎక్కి చనిపోలేదంటూ ఏఈ గౌతమ్ మాట్లాడటంతో గ్రామస్తులు ఆగ్రహంతో రగిలిపోయారు. న్యాయం చేసే వరకు అక్కడి నుంచి కదలబోమంటూ ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఆస్పత్రి ఎదుటనే బంధువులు, గ్రామస్తులు బైఠాయించారు. చివరకు ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ఎస్ఐ ఆరోగ్యరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు తీసుకున్నారు.

ఆన్‌లైన్ మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం మహాత్మా గాంధీనగర్‌లో నివశించే సూర్యదేవర నాగలింగేశ్వరరావు తన సెల్‌లో ఎస్‌బీఐ యూనో యాప్ రీయాక్టీవేట్ చేస్తున్న సమయంలో లింకులు వచ్చాయి. అందులో అడిగిన వాటికి వివరాలు తెలిపాడు. అనంతరం కొంత సేపటి తరువాత నాగలింగేశ్వరరావు అకౌంట్‌లోని రూ. 70లో విత్‌డ్రా అయ్యాయి. బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీ ఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాహుల్‌గాంధీనగర్ 5వ లైనులో నివశించే కరణం లక్ష్మీకాంతారావు ఈనెల 17వ తేదీ ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలసి ఊరు వెళ్లాడు. 18వ తేదీ తిరిగి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఆరు సవర్ల బంగారు ఆభరణాలు, కొంత వెండి సామగ్రితో పాటు, రూ. 20 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పురుగు మందుల గోదాంలో ఆకస్మిక తనిఖీలు



గుంటూరు రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా పురుగు మందులు, ఎరువుల విక్రయాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గుంటూరు అర్బన్ – 2 వ్యవసాయ శాఖ అధికారి బి.కిషోర్ హెచ్చరించారు. సోమవారం ఏటుకూరు రోడ్డులోని చంబల్ ఫెస్టిసైడ్స్ కంపెనీలో ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంబంధిత గోదాం అద్దె రెన్యువల్ చేసుకోలేదని గుర్తించారు. అదేవిధంగా మిరిమి తయారీ లైసెన్స్ గడువు తీరిందని గుర్తించారు. అయినా మార్కెటింగ్ చేస్తున్న కొన్ని కంపెనీల పురుగు మందులు గోదాంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గోదాంలోని స్టాకు మొత్తం విక్రయాలు నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రూ 1.58 లక్షల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనమందించాలి



పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎండీ ఖాసీం

చేబ్రోలు: ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం పేర్కొన్నారు. చేబ్రోలు, వడ్లమూడిలోని ఉర్దూ పాఠశాలలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళిక, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలను రూపొందించుకోవాలని, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు మహజబీన్, షకీలా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల కబ్జాపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు వెస్ట్: బడేపురంలోని దళితులకు సంబంధించిన భూములను కబ్జాచేయడమే కాకుండా తమను అధికారులు నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత సంఘం నాయకులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని దళిత సంఘం నాయకుడు వాసు తెలిపారు. గుంటూరు ఆర్డీఓ ప్రభాకర రెడ్డి, డీఆర్వో చంద్రశేఖరరావు దళితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

చిరస్మరణీయుడు పద్మశ్రీ నాజర్

లక్ష్మీపురం: ప్రాచీన జానపద కళారూపమైన బుర్రకథకు కొత్త జీవం పోసి మెరుగులుదిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావభావాలతో ఎన్నో ప్రదర్శనలిచ్చిన నాజర్ బుర్రకథ పితామహుడిగా చిరస్మరణీయులని అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ప్రజా నాట్యమండలి జాతీయ కార్యదర్శి గని అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యలయంలో సంస్థ కార్యదర్శి కొండాశి వరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పద్మశ్రీ నాజర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

24, 25వ తేదీల్లో 'ఫార్మసీ' క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: నాలుగు జిల్లాల పరిధిలోని ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈనెల 24, 25 తేదీల్లో స్పర్ధ పేరుతో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో సోమవారం క్రీడా పోటీల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని ఫార్మసీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, కేరమ్స్, చెస్, షార్ట్‌పుట్ పోటీలను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 24న ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జాన్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని, క్రీడాపోటీలను ప్రారంభించనుండగా, 25న జరిగే ముగింపు కార్యక్రమానికి ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, డైరెక్టర్ పి.సీతారామయ్య, పీడీ సీహెచ్ అజిత్‌బాబు పాల్గొన్నారు.

నోటీసులివ్వండి.. బాధితులకు న్యాయం చేయండి

మండల సర్వేయర్‌ను ఆదేశించిన తహసీల్దార్ సంజీవకుమారి



తహసీల్దారు సంజీవకుమారికి విన్నవిస్తున్న మహిళలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామ పంచాయతీతో పాటు ఆర్ అండ్ బీ అధికారులకు నోటీసులు జారీచేయాలని తహసీల్దార్ సంజీవకుమారి మండల సర్వేయర్‌కు ఆదేశాలు జారీచేశారు. ప్రత్తిపాడుకు చెందిన కొందరు మహిళలు సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆక్రమణల తొలగింపు పేరుతో అధికారులు, నాయకులు తమ ఇళ్లను కూల్చివేశారని, ఆక్రమణల్లో పోను మిగిలిన స్థలం ఎంత ఉందో సర్వే చేసి తేల్చాలని కోరారు. ఇళ్ల ముంగిట ఉన్న మురుగు కాలువను పూడ్చి.. ఇంకా వెనక్కు తీసి తమ స్థలం తమకు కాకుండా చేశారని.. మరోసారి సర్వే చేసి, న్యాయం చేయాలని బాధితులు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ సంజీవకుమారి మండల సర్వేయర్ టి.శ్రీనివాసరావుతో మాట్లాడారు. మరోసారి సర్వే చేసి వారి ఇళ్లకు హద్దులు తేల్చాలన్నారు. ఇందుకు సంబంధించి వారం గడువు ఇచ్చి, ప్రత్తిపాడు గ్రామ పంచాయతీకి, ఆర్ అండ్ బీ అధికారులకు సర్వే నోటీసులు అందించాలని ఆదేశించారు. నోటీసులు తీసుకునేందుకు పంచాయతీ అధికారులు సుముఖంగా లేరని సర్వేయర్ చెప్పడంతో, వాళ్లు తీసుకోకపోతే పంచాయతీ కార్యాలయంలో నోటీసులు అంటించాలని చెప్పారు.

టెక్నాలజీకి అనుగుణంగా భవిష్యత్తు ప్రణాళిక ఉండాలి

గుంటూరు రూరల్: విద్యార్థులు నేటి టెక్నాలజీకి అనుగుణంగా కెరీర్ ప్లాన్ చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారిని దేవిరెడ్డి కిరణ్మయి పేర్కొన్నారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ బిళ్లా కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. కిరణ్మయి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. కాలానుగుణంగా ఆలోచనా విధానం మారాలన్నారు. స్టెప్ మేనేజర్ రాధికా మాట్లాడుతూ ఆశయ సాధనకు అకుంఠిత కార్యదీక్ష తోడైనప్పుడే లక్ష్యం సిద్ధిస్తుందని తెలిపారు. ప్రిన్సిపల్ బిళ్లా కిరణ్‌కుమార్ వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.కొండయ్య, హెచ్ఓడీ ఎస్.మధుబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ కావ్య, వీఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.శ్రావణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధే లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని గుంటూరు రూరల్ మండలం జడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం గుజ్జనగుండ్ల పెదపలకలూరు రోడ్డులోని జడ్పీటీసీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంగళవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో ఉన్న డబ్బూరి కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆరుదల సాంబశివరావు, వెంకట్, ఇంద్ర, నల్లమేకల మాధవరావు, మబ్బు సుధాకర్, ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, రాంజీ అంబేడ్కర్, వెంకటరావు, ఎల్‌బసీ కోటేశ్వరరావు, పాపిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరా పాహిమాం...

పాతగుంటూరు: స్థానిక శ్రీ గంగాపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం అనంతరం తొలి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణ శర్మ, సంగమేశ్వర శర్మ స్వామికి విశేష ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిపి, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో పనిచేస్తున్న తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని వర్సిటీ కాంట్రాక్ట్ కార్మికుల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం పరిపాలన భవనం ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జీతాలు, సెలవులు తదితర విషయాలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వినతి పత్రాలను అందజేయటం జరిగిందన్నారు. ఈ నెల 15వ తేదీలోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని ముందే చెప్పామని కానీ, అధికారులు కొన్ని సమస్యలు పరిష్కరించి మిగిలినవి పట్టించుకోలదన్నారు. దీంతో నిరవధిక సమ్మెకు అసోసియేషన్ నిర్ణయించినట్లు చెప్పారు. సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారిస్తామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో.. సమ్మెను విరమించినట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.ముత్యాలరావు, అధ్యక్షురాలు మెడబలిమి పద్మ తెలిపారు. నిరసనలో ప్రధాన కార్యదర్శి నామతోటి రాణి, సుమలత, ప్రమీల, కిషోర్, రాజు, సౌజన్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ఎమ్మెల్యే రాజయ్య ప్రార్థనలు



మాజీ మంత్రి రాజయ్య, ఫాతిమామేరి దంపతులకు సన్మానం

పెదకాకాని: తెలంగాణ మాజీ మంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తాడికొండ రాజయ్య, ఫాతిమామేరి దంపతులు ఆదివారం రాత్రి నంబూరు ఏసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం (ఆర్‌సీఎం)ను సందర్శించారు. వారికి ఫాదర్ రెవరెండ్ పూదోట నవీన్, చర్చి కన్వీనర్ డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, సంఘస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు. తాను సంఘ కాపరి నుంచి.. పిల్లల డాక్టర్ అయినట్లు తెలిపారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా, ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసినట్లు చెప్పారు. ఐదవసారి ఎమ్మెల్యేగా గెలిచి ఈ పవిత్ర పుణ్యక్షేత్రాన్ని తిరిగి దర్శించుకుంటానన్నారు. రూ.7 వేలు విలువ చేసే 32 సైకిళ్లను విద్యార్థులకు ఆయన ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరి కనకరాజు, నంబూరు వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, మత్తయ్య, హృదయరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు.. ఉపాధ్యాయుల చేతుల్లో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కోతివానిపాలెం(కాకుమాను): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ పేర్కొన్నారు. మండలంలోని కోతివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. హెచ్ఎం దొంతినేని సాయికృష్ణ, సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.